క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

సీతంపేట: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బి.ఆదినారాయణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మిశ్రో ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. మండల స్థాయి ప్రజా ప్రతినిధులంతా హాజరవుతున్నారని, అధికారులు కూడా హాజరుకావాలని కోరారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి ఘనంగా నివాళులు

గరుగుబిల్లి: భారతీయ జనసంఘ వ్యవస్థాపకుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి మండల కేంద్రంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు పి.అశోక్ తదితరులు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన పార్టీకి, దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో యు.సత్యనారాయణ, కె.నరసింగరావు, టి.శంకరరావు, పి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నేత మృతి


టంకాల దుర్గారావు(ఫైల్)

పాలకొండ రూరల్: స్థానిక చిన్నకాపు వీధిలో నివాసం ఉంటున్న సీనియర్ బీజేపీ నాయకుడు టంకాల దుర్గారావు సోమవారం మృతి చెందారు. ఇటీవల అనారోగ్యానికి గురైన ఆయన.. అకస్మాత్తుగా ఇప్పుడు చనిపోవడం పట్ల ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. 37 ఏళ్లుగా బీజేపీలో ఉన్న ఆయన ప్రస్తుతం ఆ పార్టీ తూర్పుకాపు సంఘం డైరెక్టర్‌గా ఉన్నారు. గతంలో రైల్వే బోర్డు సభ్యుడిగా, ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడిగా పనిచేశారు.

ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన

పాలకొండ: మండలంలోని కొండాపురంలో ఫ్లోరోసిస్ వ్యాధిపై గ్రామస్తులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ లకినేని అరుణజ్యోతి వ్యాధి లక్షణాలు, ఏ విధంగా వస్తుంది.. దాని ప్రభావం, నివారణ చర్యలను వివరించారు. వ్యాధి బారినపడిన వారి కోసం ప్రత్యేకంగా పునరావాస కేంద్రాలు ఉన్నాయన్నారు. ఎవరైనా వ్యాధి లక్షణాలతో బాధపడితే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎం కుమారి, ఎంఎల్‌హెచ్‌పీ దేవీపార్వతి తదితరులు పాల్గొన్నారు.

కుల ధ్రువీకరణపత్రం మంజూరు చేయండి


తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న కుల సంఘ నాయకులు

జియ్యమ్మవలస రూరల్: తురకనాయుడువలసలో నివాసముంటున్న పలు కుటుంబాల వారు (ఎర్రగొల్లలని అనబడుతున్న) ఎస్టీ ఎరుకుల కులానికి చెందిన వారమైన తమకు ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని కోరారు. ఇదే విషయమై మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు విజయలక్ష్మిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. రెండేళ్లుగా తమకు ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో తమ పిల్లల చదువుకు ఆటంకం ఏర్పడుతోందన్నారు. హాస్టల్ చేర్పించాలన్నా ధ్రువీకరణ పత్రం అడుగుతున్నారన్నారు. గతంలో తహసీల్దారు, కలెక్టర్ దృష్టికి తమ సమస్యలు తీసుకువెళ్లినా న్యాయం జరగలేదన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

భామిని: మండలంలోని సొలికిరి గ్రామంలో జరుగుతున్న సీసీ కాలువ నిర్మాణ పనులను ఎంపీటీసీ చంద్రశేఖర్, సర్పంచ్ ప్రభాకర్‌లు సోమవారం పరిశీలించారు. నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. పనులు యుద్ధప్రాతిపదికన చేసి, వినియోగంలోకి తీసుకురావాలన్నారు.

30 మందికి ఉద్యోగావకాశాలు

సాలూరు: పట్టణంలోని సత్యసాయి డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 30 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. దివీస్ ఫార్మా కంపెనీ నిర్వహించిన ఈ జాబ్‌మేళాకు 50 మంది నిరుద్యోగులు హాజరు కాగా 30 మంది ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈ మేరకు ఉద్యోగాలు పొందిన వారిని కళాశాల సిబ్బంది అభినందించారు.

ఆకలితో అలమటించారు..

పార్వతీపురం: విశాఖపట్నంలో ఎంతో ఆర్భాటంగా నిర్వహించిన యోగాంధ్రలో పాల్గొన్న పారిశుధ్య కార్మికులు ఆకలితో అలమటించారని సీఐటీయూ జిల్లా కార్యదర్శులు బీవీ రమణ, జీవీ రమణ అన్నారు. సోమవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణలో వారు మాట్లాడుతూ.. పార్వతీపురం నుంచి 44 మంది కార్మికులు వెళ్లగా వారికి వసతి, భోజన సదుపాయం కల్పించలేదని మండిపడ్డారు.


పాలకొండ: తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గిరిజనులు, వ్యవసాయ, కార్మిక సంఘాల నాయకులు


గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న గిరిజన సంఘ నాయకులు


జియ్యమ్మవలస రూరల్: వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

కొండపోడు భూములకు పట్టాలివ్వండి!

కొండపోడు భూములకు పట్టాలు అందివ్వాలని గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయమై పాలకొండ, కురుపాం నియోజకవర్గాల్లోని మన్యం ప్రాంతాల గిరిజనులంతా తహసీల్దారు కార్యాలయాల వద్ద సోమవారం ఆందోళనకు దిగారు. కొన్ని దశాబ్దాలుగా సాగు చేస్తున్న తమ భూములకు ఇంతవరకు ఎవరూ పట్టాలివ్వలేదని, దీంతో ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నామన్నారు. కనీసం వ్యవసాయ రాయితీలు, బ్యాంకు రుణాలు కూడా రావడం లేదన్నారు. అనంతరం తహసీల్దార్లకు వినతిపత్రాలు సమర్పించి, తక్షణమే పట్టాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

-పాలకొండ, కురుపాం


కొమరాడ: తహసీల్దారు సత్యనారాయణకు వినతిపత్రం అందిస్తున్న గిరిజన, వ్యవసాయ, రైతు సంఘాల నాయకులు తదితరులు


గుమ్మలక్ష్మీపురం: తహసీల్దారు కార్యాలయం ముట్టడించి నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజనులు

రైతు సమస్యలు పరిష్కరించండి

• ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్


ఇరిగేషన్ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, రైతులు

పాలకొండ రూరల్: నేనూ ఓ రైతుగా అడుగుతున్నా..రైతు సమస్యలు పరిష్కరించండి అని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కోరారు. సాగునీరు సక్రమంగా అందడం లేదన్న కారణంతో పలువురు రైతులు ఎమ్మెల్సీని కలవగా ఆయన మండల కేంద్రంలోని ఇరిగేషన్ కార్యాలయానికి సోమవారం వెళ్లి, డీఈ, ఏఈలు గనిరాజు, బీవీ రమణలను కలిసి రైతు సమస్యలు విన్నవించారు. ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్న రైతులంతా సాగునీటి కోసం అవస్థలు పడుతున్నారని, వారికి సక్రమంగా సాగునీరు అందే ఏర్పాట్లపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తాను కూడా వీరఘట్టం మండలం, నీలానగరం ఓపెన్ హెడ్ చానల్ పరిధిలోని రైతునేనని, చానల్ దిగువన బిటివాడ, మొట్ట వెంకటాపురం, కుమ్మరిగుంట, నీలానగరం, తలవరం, పనస నందివాడ గ్రామాలకు సాగునీరు సరిగా అందడం లేదన్నారు. ఖరీఫ్ సాగు పనులు ఆరంభమవుతున్న నేపథ్యంలో రైతులకు ఇబ్బందులు లేకుండా పూర్తి స్థాయిలో సాగునీరు పొలాలకు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటీవల చానల్ పనులకు ఓఅండ్‌ఎం నిధులు రూ.11 లక్షలు పైబడి మంజూరు చేయడం జరిగిందని, ఆయా నిధులతో చేపట్టిన కాలువ పనులు లోపభూయిష్టంగా ఉండడంతో నాగావళి నది నీరు పొలాలకు చేరడం లేదని వివరించారు. చానల్ పనులు నిబంధనల మేర జరగలేదన్నారు. ఓ వైపు సమస్య ఇలా ఉంటే మరోవైపు బొడ్డగెడ్డకు కూడా ఆశించినంతగా సాగునీరు సమకూరడం లేదన్నారు. ఈ గెడ్డ సమీపంలోని దోనికి రెండుచోట్ల గండ్లు పడ్డాయన్నారు. కర్షకుల కష్టం గుర్తించి, శాశ్వత ప్రాతిపదికన గండ్లు పూడ్చడంతో పాటు రైతు సంక్షేమం దృష్టిలో ఉంచుకుని వారి సమస్యలు వెంటనే తీరేలా చొరవ తీసుకోవాలన్నారు. ఆయన వెంట సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, రైతులు వైవీ శర్మ బుగత, తిమ్మరాజు పంతులు, వి.గోవిందరావు, పి.వెంకటరమణ, ఎస్.గోవిందరావు, మెట్ట వెంకటరమణ, బుగత అమృతరావు, కృష్ణంనాయుడు, ఎస్.మధుసూదనరావు, దేవకివాడ భుజంగరావు, పాలవలస దవళేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ


తహసీల్దారు సత్యనారాయణ


బాధ్యతలు స్వీకరిస్తున్న జయ


తహసీల్దారు కామేశ్వరరావు

గుమ్మలక్ష్మీపురం: కురుపాం తహసీల్దారుగా కె.జయ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ తహసీల్దారుగా పనిచేసిన రమణమ్మకు భోగాపురానికి బదిలీ కాగా ఆ స్థానంలో జయ బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు ఆమెకు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మండల ప్రజల రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జయ అన్నారు.

వీరఘట్టం: మండల తహసీల్దారుగా ఏఎస్ కామేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దారుగా కె.కవిత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు వారికి కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మండలంలో నెలకొన్న రెవెన్యూ సమస్యలపై సిబ్బందిని ఆరాతీశారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సిబ్బంది సహకరించాలని వారు కోరారు.

కొమరాడ: మండలం తహసీల్దారుగా సీహెచ్ సత్యనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ తహసీల్దారుగా పనిచేసిన కామేశ్వరరావు వీరఘట్టం బదిలీ కాగా ఆయన స్థానంలో ఈయన నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

వన్‌బీలు రావడం లేదని ఆందోళన


తహసీల్దారు కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న గిరిజనులు

జియ్యమ్మవలస రూరల్: తమ భూములకు సంబంధించి, వన్‌బీలు రావడం లేదని మండలంలోని గడసింగుపురం పంచాయతీ, ఏనుగులగూడ గిరిజనులు సోమవారం ఆందోళనకు దిగారు. తహసీల్దారు కార్యాలయం వద్ద చేపట్టిన ఈ కార్యక్రమంలో 20 కుటుంబాల వారు పాల్గొని, తమ సమస్యలపై నినాదాలు చేశారు. గత ప్రభుత్వం తమకు డీ-పట్టాలు అందజేసిందని, అయితే ఇప్పుడు వాటికి సంబంధించిన వన్‌బీలు ఆన్‌లైన్‌లో రావడం లేదన్నారు. దీంతో తామంతా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వ్యవసాయ రుణాలు, రాయితీలు అందుకోలేకపోతున్నామని వాపోయారు. తక్షణమే వన్‌బీలు వచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

పేదలకు భూములివ్వండి



తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

వీరఘట్టం: పెత్తందారుల ఆధీనంలోని అసైన్డ్ భూములను పేదలకు అందివ్వాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎస్.సింహాచలం, వి.ఇందిర కోరారు. ఇదే విషయమై వారు పేదలతో కలిసి మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. గతంలో పేదలకు ఇచ్చిన వివిధ పట్టాలకు సంపూర్ణ హక్కులు కల్పించాలన్నారు. కొన్ని వందల ఎకరాల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమై పెత్తందారుల ఆక్రమణలో ఉన్నాయని, అటువంటి భూములను గుర్తించాలన్నారు. అటువంటి భూమిని తీసుకుని, సెంటు భూమి లేని నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అందజేయాలన్నారు. అనంతరం వినతిపత్రాన్ని తహసీల్దారు కామేశ్వరరావుకు అందజేశారు.

చిన్నబగ్గ టేకు ప్లాంటేషన్‌లోకి ఏనుగులు..

సీతంపేట: సీతంపేట-కొత్తూరు ప్రధాన రహదారి దాటి నాలుగు ఏనుగుల గుంపు చిన్నబగ్గ టేకు ప్లాంటేషన్‌లోకి సోమవారం వెళ్లాయి. వెంపలగూడ, రేగులగూడ పరిసర గ్రామాల్లో శని, ఆదివారాల్లో సంచరించిన ఆ ఏనుగులు అకస్మాత్తుగా టేకు ప్లాంటేషన్‌లోకి వెళ్లడంతో అక్కడి వారు భయాందోళనకు గురవుతున్నారు. ఇదిలా ఉంటే అటవీ శాఖ బీట్ ఆఫీసర్ దాలినాయుడుతో పాటు ట్రాకర్లు ఎప్పటికప్పుడు ఏనుగుల గమనాన్ని పరిశీలిస్తూ ప్రజలకు తగు సూచనలిస్తున్నారు.

గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల ఏర్పాటు చేయండి

పార్వతీపురం: ఐటీడీఏ ఆధ్వర్యంలో పార్వతీపురం జిల్లా కేంద్రంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలను ఏర్పాటు చేయాలని గిరిజన సంఘ నాయకులు పల్ల సురేష్, పాలక రంజిత్‌కుమార్, ఆరిక చంద్రశేఖర్, రామకృష్ణ, తదితరులు కోరారు. ఈ మేరకు సోమవారం వారు మాట్లాడుతూ.. విజయనగరం జిల్లా పరిధిలోని ఆంధ్ర గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడిని పార్వతీపురం గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలకు డిప్యూటేషన్‌పై బదిలీ చేసి, ఇటువంటి అక్రమ డిప్యుటేషన్లను తక్షణమే రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో బంగారొరాజు, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

పార్వతీపురం టౌన్: పీఏసీఎస్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ (పీఏసీఎస్) ఉద్యోగుల యూనియన్ అధ్యక్షుడు ఆర్ సత్యారావు, ఏఐటీయూసీ పార్వతీపురం మన్యం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌వీఎస్ కుమార్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి, అనంతరం డీఆర్‌ఓ హేమలతకు వినతిపత్రం అందజేశారు.

ఇతర మండలాలకు బదిలీ చేయొద్దు


ఆందోళన చేస్తున్న విలేజ్ సర్వేయర్లు

పాలకొండ: విలేజ్ సర్వేయర్లను సొంత మండలానికి తప్ప ఇతర మండలాలకు బదిలీ చేయవద్దని విలేజ్ సర్వేయర్ల మండల సంఘం అధ్యక్షుడు కడారి ఈశ్వర్, రాష్ట్ర క్రీడల కార్యదర్శి వి.ఉదయ్‌కుమార్‌లు డిమాండ్ చేశారు. ఇదే విషయమై వారు సర్వేయర్లతో కలిసి మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. రేషనలైజేషన్ పూర్తయిన అనంతరం సీనియార్టీ ప్రకారం బదిలీలు చేయాలని కోరారు. రీసర్వే పూర్తి చేసిన సిబ్బందికి టీఏ, డీఏలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సర్వేయర్లు నెల్లి శివ, చిరంజీవి, ఉపేంద్ర, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

'యువత పోరు'కు వైఎస్సార్ సీపీ శ్రేణుల పయనం


జై వైఎస్సార్ సీపీ, జై జగన్ నినాదాలు చేస్తున్న కొమరాడ మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు

కొమరాడ: కూటమి ప్రభుత్వం నిరుద్యోగ యువతకు చేసిన మోసంపై పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన యువత పోరు కార్యక్రమానికి మండలానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, నిరుద్యోగ యువకులు బయలుదేరి వెళ్లారు. దారి పొడవునా జై జగన్.. జై వైఎస్సార్ సీపీ నినాదాలు చేసుకుంటూ ఉత్సాహంతో కార్యక్రమంలో పాల్గొని, నిరుద్యోగుల తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నిరుద్యోగ భృతి, ఉద్యోగాలు ఎక్కడని నిలదీశారు. ఎన్నికల హామీలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమానికి వెళ్లిన వారిలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దనరావు, పార్టీ జిల్లా యూత్ వింగ్ ప్రెసిడెంట్ శరత్‌బాబు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కరించాలని 62 వినతులు


వినతిపత్రాలు పరిశీలిస్తున్న ఐటీడీఏ ఏపీవో చిన్నబాబు

సీతంపేట: స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి పలువురు గిరిజనులు హాజరై తమ సమస్యల పరిష్కారానికి వినతులు సమర్పించారు. తమ పిల్లలు చదువుకునేందుకు పాఠశాలలు, కళాశాలల్లో సీట్లు ఇప్పించాలని కొంతమంది, కుట్టుమిషన్లు అందివ్వాలని మరికొంతమంది, రుణాలు మంజూరు చేయాలని ఇంకొంతమంది ఇలా మొత్తం 62 అర్జీలను ఏపీవో జి.చిన్నబాబుకు అందజేశారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ డీడీ అన్నదొర, ఈఈ రమాదేవి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'జుగా' గ్రామసభలు

సీతంపేట: ప్రజాసమస్యల పరిష్కారానికే పీఎండీఏ జుగా గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ ఈవో జి.రామ్మోహన్‌రావు తెలిపారు. స్థానిక గ్రామ సచివాలయంలో జుగా గ్రామసభ సోమవారం నిర్వహించారు. ఎటువంటి సమస్యలున్నా తక్షణమే ఈ సభల్లో పరిష్కరించడం జరుగుతుందని, ఎవరైనా తమ సమస్యను వినతిపత్రం రూపంలో సమర్పించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కుండంగి సరస్వతి, సర్పంచ్ ఆరిక కళావతి, ఎంపీడీవో రామకృష్ణ, కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.

సన్మానం


వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

పాలకొండ రూరల్: స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ పట్నాల వెంకటేశ్వరరావును డిపోలో సోమవారం సన్మానించారు. ఆయన పదోన్నతిపై పార్వతీపురం మన్యం జిల్లా డీపీటీవోగా వెళ్తుండడంతో ఈ సత్కారం చేసినట్లు ఈయూ జోన్ కార్యదర్శి భాసూరు కృష్ణమూర్తి తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు, గ్యారేజీ, యూనియన్ నాయకులు దుర్గారావు, బీఆర్ కుమార్ పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన


ఫారంపాండ్‌ల నిర్మాణం పరిశీలిస్తున్న ఏపీవో బాబూరావు

భామిని: మండలంలోని పసుకుడి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఏపీవో రేగిడి బాబూరావు సోమవారం పరిశీలించారు. నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేయాలని, వర్షాలు పడుతున్నందున పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్ బి.వేణు తదితరులు పాల్గొన్నారు.

• తప్పిన ప్రమాదం



కురుపాం మండలంలోని రంగపురం సమీపంలో సోమవారం ఓ పెద్ద ప్రమాదం తప్పింది. ఎదురెదురుగా వస్తున్న రెండు ఆర్టీసీ బస్సులు ఒకదానికొకటి దారి ఇచ్చుకునే క్రమంలో బీరుపాడు నుంచి కురుపాం వైపు వెళ్తున్న బస్సు రోడ్డు పక్కన మట్టిలో కూరుకుపోయింది. అదృష్టవశాత్తు ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. సింగిల్ రోడ్డు కావడంతో అకస్మాత్తుగా జరిగే వాహనాలకు దారి ఇచ్చే క్రమంలో ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని వాహనదారులు చెబుతున్నారు. ప్రమాదం జరగకముందే డబుల్ రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు. -గుమ్మలక్ష్మీపురం

• అధ్వానంగా రోడ్డు



భామిని మండలం, గురండి సెంటర్ రోడ్డు అధ్వానంగా తయారైంది. రోడ్డు పూర్తిగా మరమ్మతులకు గురైంది. ఇటీవల రహదారి మరమ్మతుల పేరిట రోడ్డుకు ఇరువైపులా తవ్వకాల పనులు చేపట్టడంతో ఏర్పడిన గుంతల్లో ఏ చిన్నపాటి వర్షం కురిసినా భారీగా వరదనీరు చేరిపోతోంది. దీంతో ఎక్కడ గొయ్యి ఉందో తెలియని పరిస్థితి నెలకొంది. ఇదిలానే కొనసాగితే గుంతల్లో పడి వాహనదారులు ప్రమాదానికి గురికాక తప్పదని పలువురు అంటున్నారు. మరోవైపు ధ్వంసమైన రోడ్డును బాగుచేయాలని స్థానికులు కోరుతున్నారు. -భామిని

• సచివాలయ ఉద్యోగుల ఆందోళన



పదోన్నతులు కల్పించిన తర్వాతే బదిలీలు చేయాలని డిమాండ్ చేస్తూ సచివాలయ ఉద్యోగులు పాలకొండ నగరపంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. గతంలో కన్నా తమపై పనిభారం అధికమైందని, సరిపడ వేతనాలు కూడా అందివ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నోషనల్ ఇంక్రిమెంట్‌లు, జాబ్‌చార్టు సక్రమంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సచివాలయాల అడ్మిన్‌లు షణ్ముఖరావు, మాధురి, రాజీవ్, సాయి తదితరులు పాల్గొన్నారు. -పాలకొండ రూరల్